

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 10-10-2026 | సంపుటి - 31 | సంచిక - 138 | రూ : 4 | పేజీలు: 8



‘గ్లోబల్ కాన్ఫిడెన్స్’కు
గమ్యస్థానంగా హైదరాబాద్

- ‘బ్యాక్‌బేస్’ సంస్థ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాకుండా.. ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే ‘గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్’గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రహెన్సివ్ ఎకోసిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం ‘బ్యాక్‌బేస్’ సంస్థ ‘డెవలప్‌మెంట్ సెంటర్’ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. తరువాయి 2లో

అద్భుత పర్యాటక ప్రదేశాలకు
నిలయం తెలంగాణ




- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- టీటీఎఫ్ ప్రదర్శన ప్రారంభం

రాయదుర్గం : పురాతన, వారసత్వ కట్టడాలు, కోటలతోపాటు సహజసిద్ధ ప్రకృతి అందాలు, వనాలు, జలపాతాల వంటి ప్రత్యేక ఆకర్షణలకు తెలంగాణ నిలయమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫెయిర్ ఫెస్ట్ మీడియా ఆధ్వర్యంలో.. ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) పేరుతో నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రదర్శనను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో గిరిజన బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను మంత్రి కృష్ణారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ సీఎం సలహాదారు నాసిర్ అస్లం వనీ, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరు, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్, జమ్మూ కశ్మీర్ పర్యాటక శాఖ డైరెక్టర్ వికాస్‌గుప్తా, స్కాల్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారత పైలట్ స్మిత్ మచ్చర్‌కు
ఇజ్రాయెల్ సాహస పురస్కారం

- స్మిత్ కోలుకున్నాక పురస్కారం అందిస్తానన్న అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్
- సహ పైలట్ దాడిని ఎదుర్కొని 174 మంది ప్రాణాలను కాపాడిన మచ్చర్ 2లో



అంతర్జాతీయ న్యాయపోరాటం
నవీ పిళ్లైకు నోబెల్ శాంతి పురస్కారం


- 2026 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం నవీ పిళ్లైకు ప్రకటన
- భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లై
- యుద్ధ నేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై పోరాటానికి గుర్తింపు
- రువాండా, అంతర్జాతీయ న్యాయస్థానాల్లో న్యాయమూర్తిగా కీలక పాత్ర
- అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ ప్రాముఖ్యతను చాటిన నోబెల్ కమిటీ



అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం ‘నవీ’ పిళ్లైను 2026 సంవత్సరానికిగాను అత్యంత తరువాయి 2లో

‘నంబర్ వన్’
డాక్టర్ల ప్రచారాలకు చెక్..!

- రోగులు, సెలబ్రిటీలతో ప్రచారం చేయడం కుదరదు
- నిరాధారమైన ‘100 శాతం నయం’ వాదనలు నిషేధం
- నకిలీ ఫాలోవర్లు, రేటింగులు పెంచుకోవడం తప్పు
- ఏఐతో తప్పుడు రోగుల ప్రశంసలు సృష్టించడం కుదరదు
- ఉల్లంఘనలకు రిజిస్ట్రేషన్ నిలిపివేత వరకు చర్యలు



దేశవ్యాప్తంగా వైద్యులు, ఆసుపత్రులు, వైద్య సంస్థలు చేపట్టే ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలపై జాతీయ వైద్య కమిషన్ (NMC) కఠిన నిబంధనలు విధించింది. వైద్య రంగంలో నైతిక విలువలను కాపాడటం, తప్పుదోవ పట్టించే ప్రకటనల నుంచి రోగులను రక్షించడం లక్ష్యంగా ఈ సమగ్ర మార్గదర్శకాలను అక్టోబర్ 6న జారీ చేసింది. ఈ నిబంధనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ తరువాయి 2లో


మోదీ పేరిట నోయిడా ఎయిర్‌పోర్ట్..
యోగి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల



మంది ప్రయాణికులకు సేవలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని ‘నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం’గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న తరువాయి 2లో




సీజేఐ నిరసన సెగ
ఢిల్లీలో రోజంతా ఇంటర్నెట్ బంద్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసన
- ఢిల్లీలోని జన్‌పథ్ చుట్టూ 4 కి.మీ. పరిధిలో ఇంటర్నెట్ నిలిపివేత
- శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 24 గంటల పాటు ఆంక్షలు
- టెలికం సంస్థలకు ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ పోలీసు యంత్రాంగం
- ప్రభుత్వ కలిన చర్యలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ తరువాయి 2లో

శాంతి నోబెల్ మిస్..
ట్రంప్ అసహనం!

- నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ట్రంప్ అసంతృప్తి
- విజేత నవీ పిళ్లైను విమర్శిస్తూ చేసిన పోస్టును రీషేర్ 2లో
- దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లైకు 2026 శాంతి బహుమతి
- అంతర్జాతీయ నేరాలపై ఆమె పోరాటానికి గుర్తింపుగా పురస్కారం



'గ్లోబల్ కాన్ఫిడెన్స్'కు గమ్యస్థానంగా హైదరాబాద్

హైదరాబాద్: హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాకుండా.. ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రహెన్సివ్ ఎకో సిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం 'బ్యాక్‌బేస్' సంస్థ 'డెవలప్‌మెంట్ సెంటర్'ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''అనతికాలంలోనే టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్‌ను గ్లోబల్ కంపెనీలకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దాం. గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను అందించడంలో ఈ బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుంది'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ సీటీఓ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

*** కేపీహెచ్బీ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్**



కూకట్పల్లి,ప్రజాస్ఫూర్తి:.నిజాంపేట్ రోడ్ కు చెందిన కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు గ్రాండ్ మాస్టర్ డా. టి. గోపీ కృష్ణ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో పాల్గొని తన మార్షల్ ఆర్ట్స్ ప్రతిభను చాటుకున్నారు. 2026 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ విభాగంలో కేవలం 20 నిమిషాల్లో 40 సార్లు కరాటే కటాను ప్రదర్శించారు. ఈ అధికారిక రికార్డు ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సెప్టెంబర్ నాలుగో వారంలో అందుకున్నారు.ఈ సందర్భంగా కేపీహెచ్బీ కాలనీ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్‌ను గ్రాండ్ మాస్టర్ డా. టి. గోపీ కృష్ణను శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రయత్నానికి సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని సీఐ కి చూపించారు. డా. గోపీ కృష్ణ సాధించిన ఈ ఘనతను సీఐ జి. విజయ్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మార్షల్ ఆర్ట్స్ రంగంలో ఆయన చేస్తున్న సేవలు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక రికార్డు ప్రయత్నంలో ఆయన భాగస్వామ్యం యువతకు, మార్షల్ ఆర్ట్స్ అభ్యాసకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. కఠోర సాధన, పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవచ్చని అన్నారు

వాహనాలే లక్ష్యంగా డీజిల్ చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

- **రూ. 1.70 లక్షల నగదు బెలెనో కారు స్వాధీనం**
- **కేసు వివరాలు వెల్లడించిన రామన్నపేట సిఐ రవి**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి:మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ లో పార్కింగ్ చేసిన లారీల నుంచి డీజిల్ దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు రామన్నపేట సీఐ రవి తెలిపారు. శుక్రవారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని న్యూ అల్లాపూర్ కాలనీ, బోరబండ ప్రాంతానికి చెందిన సయ్యద్ సోహైల్ అనే వ్యక్తి రాత్రి వేళల్లో పెట్రోల్ బంకుల పక్కన పార్క్ చేసిన లారీలను లక్ష్యంగా చేసుకొని ఐరన్ రాడ్ సహాయంతో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి 250లీటర్లడీజిల్,రూ.1,70,000 నగదు,ఒక బెలెనో కారు,వివో సెల్‌ఫోన్‌ను సహా పలు పస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని, తెలిపారు అతనికి సహకరించిన నలుగురు వ్యక్తులను కూడా త్వరలో అదుపులో తీసుకుంటామని అన్నారు. వీరు రామన్నపేట, వలిగొండ, భువనగిరి, మండలాలలో దొంగతనాలు, చేసేముందు రెక్కీ నిర్వహించి ప్లాన్ ప్రకారం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు, కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని అభినందిస్తూ వారి పనితీరుపై ఉన్నతాధికారులకు,నివేదిక ఇచ్చి తగిన అవార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు

అంతర్జాతీయ న్యాయపోరాటం
నవీ పిళ్ళైకు నోబెల్ శాంతి పురస్కారం

అంతర్జాతీయ న్యాయం, మానవ హక్కుల కోసం దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న భారత సంతతి న్యాయమూర్తి నవనీతం 'నవీ' పిళ్ళైను 2026 సంవత్సరానికి గాను అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలన వంటి తీవ్రమైన అంశాలపై నేరస్థులను చట్టం ముందు నిలబెట్టేందుకు ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ఈ ప్రకటన చేసింది. అసాధారణమైన ధైర్యం, నైతిక నిబద్ధతతో ప్రపంచ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను కమిటీ కొనియాడింది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో మగ్గుతున్న ఒక భారత తమిళ మూలాలు ఉన్న కుటుంబంలో నవీ పిళ్ళై జన్మించారు. సమాజంలో పాతుకుపోయిన తీవ్రమైన వివక్ష, వేర్పాటువాదాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వర్ణవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన నెల్సన్ మండేలా వంటి ఎందరో ఉద్యమకారులకు ఆమె న్యాయవాదిగా అండగా నిలిచారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఆమె దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా, రువాండా అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ (ICTR), అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ICC) న్యాయమూర్తిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గానూ సేవలందించారు. ఇటీవల వరకు ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై యూఎన్ ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం ఆమె మయన్మార్‌పై నమోదైన జాతి నిర్మూలన కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ICJ) లో న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. రువాండా ట్రైబ్యునల్‌లో నవీ పిళ్ళై పాత్ర చరిత్రాత్మకమైనది. అత్యాచారం, లైంగిక హింసను కేవలం సాధారణ నేరాలుగా కాకుండా, మానవత్వానికి వ్యతిరేక నేరాలుగా, జాతి నిర్మూలన చర్యగా పరిగణించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.కేవలం విద్వేషపూరిత ప్రచారం ద్వారా జాతి నిర్మూలనకు ప్రేరేపించారన్న ఆరోపణలపై ఒక నిందితుడిపై విచారణ జరగడంలోనూ ఆమె ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ న్యాయ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ప్రపంచంలో యుద్ధాలు, ఘర్షణలు పెరిగిపోతున్నాయని, అంతర్జాతీయ చట్టబద్ధ పాలన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని నోబెల్ కమిటీ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. అధికార రాజకీయాల ప్రాబల్యం పెరిగి, న్యాయ వ్యవస్థలు బలహీనపడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి క్లిష్ట సమయంలో, శాంతికి న్యాయమే పునాది అని, అరాచకం, అధికార దర్పం మధ్య న్యాయాన్ని కాపాడే న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకమని నొక్కి చెప్పింది. నవీ పిళ్ళై వంటి ధైర్యవంతులు దేశాలను, నాయకులను జవాబుదారీగా నిలబెడుతూ, హింస బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని ప్రశంసించింది. ఆమె నిబద్ధత, స్వాతంత్ర్యం, అపారమైన అనుభవం ఆమెను మన కాలంలోని అత్యంత గౌరవనీయమైన అంతర్జాతీయ న్యాయవేత్తలలో ఒకరిగా నిలబెట్టాయని కమిటీ పేర్కొంది.

శాంతి నోబెల్ మిస్.. ట్రంప్ అసహనం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిని ఆశించి మరోసారి భంగపడ్డారు. తాను ఆశించిన 2026 నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా మానవ హక్కుల న్యాయ నిపుణురాలు నవీ పిళ్ళైతో పాటు, అవార్డును ప్రకటించిన నార్వేజియన్ నోబెల్ కమిటీని విమర్శిస్తూ చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో రీషేర్ చేశారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ట్రంప్ ఈ మేరకు స్పందించారు. తన మాజీ న్యాయవాది డేవిడ్ షోయెన్ చేసిన ఒక పోస్టును ఆయన పంచుకున్నారు. "ఐక్యరాజ్యసమితికి చెందిన నవీ పిళ్ళైకు ఈ పురస్కారాన్ని అందజేయడం ద్వారా నోబెల్ కమిటీ కోలుకోలేని విధంగా అవమానానికి గురైంది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి విలువను ఇది తగ్గించింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నవీ పిళ్ళై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను తీవ్రంగా ద్వేషిస్తారని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ హమాస్‌కు అండగా నిలిచారని అందులో ఆరోపించారు. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఆమె నేతృత్వంలోని ఐరాస కమిషన్ నివేదించడాన్ని ఒక "ప్రహసనం"గా అభివర్ణించారు. అదే సమయంలో, అబ్రహాం ఒప్పందాలు, బందీల విడుదల, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణకు ట్రంప్ చేసిన కృషిని కొనియాడుతూ, ఆయనకే నోబెల్ దక్కాలని ఆ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతిని దక్షిణాఫ్రికాకు చెందిన 85 ఏళ్ల నవీ పిళ్ళైకు నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటించింది. యుద్ధ నేరాలు, మారణహోమాలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టానికి కట్టబెట్టడంలో ఆమె చేసిన సుదీర్ఘ పోరాటానికి ఈ గుర్తింపు దక్కినట్లు కమిటీ తెలిపింది. గతంలో ఆమె ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా, అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ అవార్డు విషయం తెలిసే సమయానికి నవీ పిళ్ళై జర్మనీలోని న్యూరెమ్‌బర్గ్ కోర్టులో ఒక కార్యక్రమంలో ఉన్నారు. ఈ వార్త తెలియగానే ఆమె చమత్కరిస్తూ, "మీరు ఇంకాస్త గట్టిగా చప్పట్లు కొడితే, ఈ బహుమతిని నేను ట్రంప్‌తో పంచుకుంటా" అని వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు పూశాయి. ట్రంప్ చాలాకాలంగా నోబెల్ శాంతి బహుమతిని ఆశిస్తున్నారు.

సీజేఐ నిరసన సెగ: ఢిల్లీలో రోజంతా ఇంటర్నెట్ బంద్

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) రేపు తలపెట్టిన నిరసన కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కఠిన ఆంక్షలు విధించారు. జన్‌పథ్ కర్తవ్య పథ్ కూడలికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను 24 గంటల పాటు నిలిపివేయాలని శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 9, శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ మేరకు ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, జియో, ఎంటీఎన్ఎల్ వంటి ప్రధాన టెలికం సంస్థలకు అధికారిక ఉత్తర్వులు వెళ్లాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023లోని నిబంధనల ప్రకారం ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలన్న తాము కోరిన విన్నపాన్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆమోదించినట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఇంటర్నెట్ సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆయా సంస్థలను ఆదేశించారు. కాగా, ఈ పరిణామం చోటుచేసుకోవడానికి కొన్ని గంటల ముందే నిరసనల అణిచివేతకు ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలోకి వచ్చే మెట్రోలు, రైళ్లపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ, "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు కదా" అని ప్రభుత్వాన్ని నిలదీసింది. అత్యున్నత న్యాయస్థానం ఇటువంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ, పోలీసులు నిరసనలను అడ్డుకోవడానికి ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించడం గమనార్హం. సీజేపీ నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

మోదీ పేరిట నోయిడా ఎయిర్‌పోర్ట్.. యోగి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

'నంబర్ వన్' డాక్టర్ల ప్రచారాలకు చెక్!

దేశవ్యాప్తంగా వైద్యులు, ఆసుపత్రులు, వైద్య సంస్థలు చేపట్టే ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలపై జాతీయ వైద్య కమిషన్ కఠిన నిబంధనలు విధించింది. వైద్య రంగంలో నైతిక విలువలను కాపాడటం, తప్పుదోవ పట్టించే ప్రకటనల నుంచి రోగులను రక్షించడం లక్ష్యంగా ఈ సమగ్ర మార్గదర్శకాలను అక్టోబర్ 6న జారీ చేసింది. ఈ నిబంధనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా చేసే ప్రచారాలకు కూడా వర్తిస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం, వైద్యులు లేదా ఆసుపత్రులు తమ సేవలను ప్రమోట్ చేసుకునేందుకు రోగుల టెస్టిమోనియల్స్ (అనుభవాలు), సెలబ్రిటీల సిఫార్సులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ప్రచారాలు, చివరికి తమ ఉద్యోగుల అభిప్రాయాలను కూడా ఉపయోగించకూడదు. ప్రచార ఉద్దేశంతో రోగుల నుంచి ప్రత్యేకంగా రివ్యూలు సేకరించడంపైకూడా నిషేధం విధించారు. "నెం.1 స్పెషలిస్ట్", "బెస్ట్ డాక్టర్", "ప్రముఖ నిపుణులు" వంటి బిరుదులను ప్రకటనల్లో వాడాలంటే, అందుకు కచ్చితమైన, నిరూపించగల ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. అదేవిధంగా, "100% సక్సెస్", "గ్యారెంటీ క్యూర్", "అద్భుత చికిత్స", "నొప్పి లేని వైద్యం" వంటి వాగ్దానాలను సరైన శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రచారం చేయకూడదని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది.

డిజిటల్ ప్రచారాలపై ప్రత్యేక దృష్టి


మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారాలపై కూడా జాతీయ వైద్య కమిషన్ ప్రత్యేక ఆంక్షలు విధించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సృష్టించిన నకిలీ రోగుల టెస్టిమోనియల్స్, తప్పుడు చికిత్సా ఫలితాలు, మోసపూరిత ప్రచార మెటీరియల్‌ను వాడటాన్ని నిషేధించింది. అయితే, ఆరోగ్య సంరక్షణ సమాచార వ్యాప్తిలో ఏఐ వాడకంపై ఇది పూర్తి నిషేధం కాదని పేర్కొంది.

అమరావతిలో చెస్ అకాడమీ.. కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన హంపిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించడంలోనూ, వ్యక్తిగత విభాగంలో బోర్డు 1పై కాంస్యం గెలవడంలోనూ హంపి పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. భవిష్యత్ తరం క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అమరావతిలో ఒక ప్రత్యేక చెస్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను హంపి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

* అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం
* ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాస్ఫూర్తి, బైంసా:నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించి, అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. తానూర్ మండలంలోని మొగ్లి, ఎల్వీ, ఝరి బి, ఝరి కె, ఝరి తండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో భూ సమస్యలు, భూసేకరణ, రహదారులు, విద్యారంగ సమస్యలపై చర్చించారు.మొగ్లి:పంజాబ్ ల్యాండ్స్ 22/ఏ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టాదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల నిర్మల్ కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో తానూర్ మండలంలోని సుమారు 2,500 ఎకరాల భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.పట్టాదారులు తమ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులకు అందజేయాలని, రికార్డులను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. గ్రామ ప్రధాన రహదారి నిర్మాణంతో పాటు వి.బి.జి. రామ్‌జీ పథకం కింద వ్యవసాయ బాటల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎల్వీ సుమారు 22 ఏళ్ల క్రితం 31 ఎకరాల భూమికి సంబంధించిన లావాదేవీలు జరిగిన నేపథ్యంలో, అనంతరం 81 ఎకరాలను నిషేధిత భూముల జాబితాలో చేర్చిన అంశంపై గ్రామసభలో చర్చించారు. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు 28వ ప్యాకేజీ భూసేకరణలో వాస్తవ విస్తీర్ణానికి మించి భూములు నమోదయ్యాయన్న రైతుల సమస్యనూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రికార్డులను పరిశీలించి, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు భూములకు సంబంధించిన ఆధారాలతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఝరి బి, ఝరి కె, ఝరి తండా: మూడు గ్రామాల పరిధిలోని 462 ఎకరాల్లో 124 ఎకరాలకు మాత్రమే పట్టాలు ఉండగా, మిగిలిన 340 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం రచ్చ రాములమ్మ

ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : సంస్కార భారతి నల్లగొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(ఉమెన్స్ డిగ్రీ కాలేజ్) నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు వైస్ టీవీ ఫౌండర్, యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్ ,జాతీయవాది రచ్చ రాములమ్మ (రమ్యకృష్ణ) ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన పూల పండగ,మన తెలంగాణ ఆడపడుచుల పండుగ బతుకమ్మను ఘనంగా నిర్వహించాలని,భారతీయ పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిరూపాలని అన్నారు. అదేవిధంగా సంస్కార భారతి ఆధ్వర్యంలో గత వారం నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన కార్యదర్శి జమల్పూర్ నిరంజన్ హాజరై మాట్లాడడం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంస్కార భారతి గత 50 సంవత్సరాల పైచిలుకు చరిత్ర కలిగి దేశవ్యాప్తంగా కళలను,ఆటలను,పాటలను,వివిధ రంగాల కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కళాకారులకు ఒక వేదికగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాస్ రాజు , సంస్కార భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్వెబోయిన శ్రీధర్, సామాజిక కార్యకర్త పొట్టిపాక నాగరాజు,వైస్ ప్రిన్సిపాల్ మంజుల ,బతుకమ్మ ఉత్సవాల కన్వీనర్ సునీత, కల్చరల్ ప్రోగ్రామ్స్ కన్వీనర్ వీరన్న, ప్రో.దయానంద్ , ప్రో.వసంత ,ప్రో.జ్యోత్స్న శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో బతుకమ్మ వేడుకలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, పొనుగోడులో బతుకమ్మ వేడుకలు ఎంతో ఆనందోత్సాహాలతో నిర్వహించబడ్డాయి. తెలంగాణ సమృద్ధమైన సాంస్కృతిక వారసత్వం రంగురంగుల పుష్పాలంకరణలు, సంప్రదాయ దుస్తులు, జానపద గీతాలు మరియు ఉత్సవ కార్యక్రమాల ద్వారా అద్భుతంగా ప్రతిబింబించింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకత, సమిష్టి కృషి మరియు మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని ప్రదర్శించారు. అందంగా అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు మరింత ఆకర్షణను, వైభవాన్ని చేకూర్చాయి. విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు కలిసి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఐక్యత, సంస్కృతి మరియు భక్తి భావాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం అందరికీ ఆనందకరమైన, మరపురాని వాతావరణాన్ని కల్పించింది.ఈ వేడుకలు కరస్పాండెంట్ రెవ. ఫా. స్వామినాథన్, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ భాను, ఫా. ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు , విద్యార్థుల మార్గదర్శకత్వంలో నిర్వహించబడ్డాయి.వారి సహకారం మరియు ప్రోత్సాహం ఈ కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిలిపాయి.

సెయింట్ మేరీస్ హైస్కూల్లో బతుకమ్మ సంబరాలు

*** ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో పోస్ట్ ఆఫీస్ సెంటర్ ప్రాంతంలో గల సెయింట్ మేరీస్ హైస్కూల్లో బతుకమ్మ సంబరాలను పాఠశాల హెచ్ఎం పోలిశెట్టి నిర్మల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు . ఉపాధ్యాయులు,విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణమంతా పూతోటగా మార్చారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి సందడి చేస్తూ సంప్రదాయ బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ శోభను చాటారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సిస్టర్ లిల్లీ డానియేల్, సిస్టర్ నిర్మల కొఫూరి, కార్యాలయ ఇన్‌చార్జి సిస్టర్ ఉషా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పడిపోయిన కరెంటు స్తంభం పట్టించుకోని అధికారులు

ప్రజాస్ఫూర్తి ,జన్నారం: జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన రైతుల పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ 15 రోజుల క్రితం కురిసిన వర్షంలో ట్రాన్స్ఫార్మర్ పోలు పడిపోయింది.ఇప్పటివరకు ట్రాన్స్ఫార్మర్ పెట్టకుండా 15 రోజుల నుండి కాలక్షేపం చేస్తు అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. రైతులు ఎన్నిసార్లు వెళ్లి మొరపెట్టుకున్నా కూడా పెడతామంటూనే కాలక్షేపం చేస్తున్నారు పంట నష్టం జరిగి ఇబ్బందులకు గురైతున్న రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం సమాధానం చెబుతాది అని ప్రజలు అడుగుతున్నారు. దీనిపై వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిర్లక్ష్యం వహించినటువంటి అధికారులను వెంటనే సస్పెండ్ చేసి కాంట్రాక్టర్ యొక్క కాంట్రాక్టు కాన్సల్ చేసి కొత్త కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వాలని కొత్త ఏఈ ని ఏర్పాటు చేయాలని జన్నారం మండల ప్రజలు కోరుతున్నారు.

142 కం పెనీలతో మెగా జాబ్‌మేళా

*** నైపుణ్యాలు పెంచుకుంటే అధిక వేతనాలు: మంత్రి శ్రీధర్‌బాబు**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. భూపాల పల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రౌండ్‌లో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 142కుపైగా కంపెనీలు పాల్గొన్న ఈ మేళాలో రెండు గంటల్లోనే 600 మందికి పైగా యువత ప్రాథమికంగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా, అనుభవం, నైపుణ్యాలు పెంచుకుంటే రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు సంపాదించే అవకాశాలుంటాయని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి యువత ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ యూనివర్సిటీ, టాస్క్ ద్వారా ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు వివరించారు. అర్హతలతో పాటు నైపుణ్యాలు ఉంటేనే మెరుగైన ఉద్యోగాలు, పదోన్నతులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళా ద్వారా సుమారు 10 వేల నుంచి 12 వేల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. గత ఏడాది నిర్వహించిన జాబ్‌మేళాలో 2,700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. టాస్క్ ద్వారా నైపుణ్య శిక్షణను విస్తరించడంతో పాటు సింగరేణి సహకారంతో శిక్షణ కేంద్రంలో విశాలమైన హాలు, ఏసీ వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ..స్థానికంగానే కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నందున యువత తమ అర్హతలకు తగిన ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు పత్రాలు అందజేశారు. జాబ్‌మేళా నిర్వహణలో కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంకీర్త్, టాస్క్ సీఈఓ ప్రదీప్‌రెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కమిషనర్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

2027-28 ఆర్థిక సంవత్సర లక్ష్యాలపై సింగరేణి కార్పొరేట్ కమిటీ సమీక్ష

*** భూపాలపల్లి ఏరియా గనుల ఉత్పత్తి, రవాణాపై చర్చ**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలో 202728 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించాల్సిన ఉత్పత్తి లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికలపై కార్పొరేట్ టార్గెట్ కమిటీ శుక్రవారం సమీక్ష నిర్వహించింది. ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ గనులు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జీఎం, కమిటీ కన్వీనర్ జి. దేవేందర్, ఉపరితల గనుల విభాగం జీఎం పి. ఎలీషా, భూగర్భ గనుల విభాగం జీఎం కె. యాదయ్య, ఐ అండ్ పీఎం జీఎం ఎం.వి. నరసింహారావు, ఐఈ విభాగం ఏజీఎం సీహెచ్.వెంకయ్య, రామగుండం రీజియన్ నాణ్యత విభాగం జీఎం జె. వెంకటరమణతో పాటు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ (మట్టి) తొలగింపు లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. 202728 ఆర్థిక సంవత్సరానికి భూగర్భ, ఉపరితల గనులకు అవసరమైన యంత్రాలు, పరికరాలు, పనిముట్లు, ఇతర సదుపాయాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేస్తూ భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కమిటీ సభ్యులు సూచించారు.

ఎల్లంపేట్ మున్సిపాలిటీలో నేటి నుంచి బతుకమ్మ వేడుకలు

*** ఘనంగా నిర్వహించేందుకు చర్యలు : చైర్‌పర్సన్ లౌడియా శ్రీదేవి రమేష్**





మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు నేటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో పండుగ సందడి నెలకొంది. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారించారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యాల పరిశీలన తదితర అంశాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. అలాగే వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

*** ఘనంగా నిర్వహించేందుకు చర్యలు**

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లౌడియా శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.తొమ్మిది రోజుల పాటు కొనసాగనున్న బతుకమ్మ వేడుకలతో ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో పండుగ వాతావరణం నెలకొననుంది. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు కోరుతున్నారు.

చెరువులో నీరు లేక బయటపడ్డ గణేష విగ్రహాలు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి):ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువుల్లో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. సరైన వర్షాలు కురవక చెరువుల్లో అరకొర నీరే ఉండటంతో, నిమజ్జనం చేసిన వినాయక ప్రతిమలు పూర్తిగా మునగకుండా నీటిపైనే దర్శనమిస్తున్నాయి.నవరాత్రుల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు అందుకున్న గణనాథుడి విగ్రహాలు, చెరువులో తగినంత నీరు లేక ఇలా పైకే కనిపిస్తుండటం భక్తుల మనోభావాలను తీవ్రంగా కలచివేస్తోంది. పూజించిన దైవ ప్రతిమలు ఇలా అసంపూర్తిగా నీటిలోనే ఉండిపోవడం చూసి భక్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, నీరు లేక బయటపడ్డ విగ్రహాలను క్రేన్ల సాయంతో ఒడ్డుకు చేర్చి, శాస్త్రోక్తంగా నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని గణేష భక్తులు, స్థానిక వార్డుల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

రైల్వే బోర్డ్ నెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ కొత్తగూడెం ఏరియాకు ఏరియా ఆఫీసర్ గా ఐఆర్ఎస్ మహారాష్ట్ర కేడర్ కు చెందిన కులకర్ణి సుభాష్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారిని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డి ఆర్ యు సి సి మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేస్తూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు నత్తనడక నడుస్తున్నాయని తక్షణమే పనులు పూర్తి చేసి రానున్న గోదావరి పురస్కారాల నాటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులకు ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని ,కరోనా కాలంలో రద్దు అయిన రైళ్లను తక్షణమే పునరుద్ధరణ చేయాలని ఆయన కోరుతూ వినతి పత్రం అందజేయగా ఏపో కులకర్ణి సుభాష్ రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు విద్యా పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలు అవసరం

*** శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: విద్యార్థులకు విద్యా పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సంస్కారం, మానవీయత కూడా అవసరమని శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్లో గల శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఇనిషియేటివ్ ఫర్ మోరల్ అండ్ కల్చరల్ ట్రైనింగ్ ఫౌండేషన్ సౌజన్యంతో మాతృపితృ వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో తల్లిదండ్రులకు ఉన్న విశిష్ట స్థానాన్ని తెలియజేశారు. విద్యార్థుల్లో తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతాభావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి, వారి ఆశీర్వాదాలను పొందారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్బి.శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్హెచ్61 నిర్మల్ భైంసా రహదారిపై అక్రమ టోల్ వసూళ్లు, అవినీతిపై లోక్పాల్ ఆఫ్ ఇండియా'కు ఫిర్యాదు



ప్రజాస్ఫూర్తి, భైంసా: జాతీయ రహదారి 61 లోని నిర్మల్ - భైంసా మార్గంలో నిబంధనలకు విరుద్ధంగా టోల్ ఫీజు వసూలు చేయడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం , అధికారుల కుమ్మక్కుపై న్యూఢిల్లీలోని లోక్పాల్ ఆఫ్ ఇండియా లో అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడిస్తూ,నిబంధనలకు విరుద్ధంగా టోల్ వసూలు జాతీయ రహదారి 61 నిర్మల్ భైంసా సెక్షన్లో రహదారి నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి కాకుండానే టోల్ ప్లాజాను ఏర్పాటు చేసి ప్రజల నుండి అక్రమంగా ఫీజు వసూలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అధికారుల కుమ్మక్కు ప్రజాధనం దోపిడీ

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ అధికారులు కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులతో కాంట్రాక్టర్ కుమ్మక్కై ప్రజల నుంచి భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో వివరించారు. దీనివల్ల కాంట్రాక్టర్కు భారీగా అనుచిత లాభం, ప్రజలకు తీరని నష్టం జరుగుతోందని తెలిపారు.

నాసిరకం రోడ్డు ప్రాణాంతక ప్రమాదాలు..

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రహదారిని నిర్మించడం మరియు సరైన నిర్వహణ లేకపోవడం వల్ల ఈ మార్గంలో వరుసగా ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కింద విచారణకు డిమాండ్

ఈ అవకతవకలపై లోక్పాల్ అండ్ లోకాయుక్త చట్టం 2013 లోని సెక్షన్ 14, 20 ప్రకారం సమగ్ర ప్రాథమిక విచారణ జరిపించాలని , అవినీతి నిరోధక చట్టం కింద సంబంధిత అధికారులపై, కాంట్రాక్టర్పై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్పాల్ను కోరినట్లు తెలిపారు.ప్రజాధనాన్ని కొల్లగొడుతూ, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని సయ్యద్ హైదర్ స్పష్టం చేశారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ, దసరా సంబరాలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:బతుకమ్మ, విజయదశమిని పురస్కరించుకుని పాల్వంచలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ,విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ మార్గదర్శకత్వంలో, ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏజీఎం రాంకీ మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలు, నైతిక విలువలను భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు. విజయదశమి స్ఫూర్తితో విద్యార్థులు క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను జ్ఞానాభివృద్ధికి ఉపయోగించుకోవాలే తప్ప దుర్వినియోగం చేయరాదన్నారు. ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన రావణ దహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రావణుడి నమూనా తలలపై ట్విట్టర్, ఫేస్బుక్, యూట్యూబ్, స్నాప్చాట్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల పేర్లను ప్రదర్శించి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతికుమార్, ఈ కిడ్జ్ కోఆర్డినేటర్ నీలిమ, ఏడి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు శైలజ, పద్మ, పీఈటి వినయ్, ఏవో వీర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



ప్రజాస్ఫూర్తి , జన్నారం:తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జన్నారం మండల కేంద్రంలోని వివిధ పాఠశాలలో,కళాశాలలో శుక్రవారం రోజున ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల,శ్రీ కృష్ణవేణి పాఠశాల, రాఘవేంద్ర లిటిల్ హార్ట్స్ పాఠశాల,స్లేట్ పాఠశాల ,మండలంలోని కలమడుగు వివేకానంద ఆంగ్లమ పాఠశాల, కొత్తపేట పాఠశాల లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కే.వి. కే-గడ్డిపల్లి లో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై కిసాన్ మేళా



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో ఆత్మ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మాశెట్టి నాగలక్ష్మి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత ఆమె ఇతర అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను ప్రారంభించి, వాటిలో ప్రదర్శించిన ఆధునిక వ్యవసాయ పరికరాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వివిధ వ్యవసాయ ఉత్పాదకాలను పరిశీలించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, పంటల సాగులో నూతన పద్ధతులు,సుస్థిర వ్యవసాయం,ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఉద్యాన పంటల సాగు,పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకొని,దిగుబడులు పెంచుకొని,రైతులు అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. కిసాన్ మేళాలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు,రైతులకు అందిస్తున్న సేవలు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. వివిధ వ్యవసాయ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు పంటల సాగులో అనుసరించాల్సిన మెరుగైన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన కల్పించాయి. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను సూచించడంతో పాటు, రైతులు-శాస్త్రవేత్తల మధ్య సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి కిసాన్ మేళా వేదికగా నిలిచింది. శాస్త్రవేత్తల సూచనలను పొలాల్లో అమలు చేయడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి. శ్రీధర్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డి. నరేష్, ఆత్మ డి.పి.డి. జి. నివేదిత, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ స్టేషన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సేవా నాయక్, టీఆర్వీకే శాస్త్రవేత్త డాక్టర్ కె. చంద్రశేఖర్, ఏఆర్ఎస్ కంపసాగర్ శాస్త్రవేత్త డాక్టర్ వి. శ్రీధర్, డ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సి.హెచ్. నరేష్, ఎ. కిరణ్, డి. ఆదర్శ్, ఎం.ఎన్. సుగంధి, డాక్టర్ పి. అక్షిత్ సాయి, ఎ. నరేష్, కవిత సీఆర్పీ, కేవీకే సిబ్బంది, బి. నాగేశ్వరరావు, బి. లింగయ్య, ఆత్మ ప్రతినిధులు, కోదాడ, హుజూర్నగర్, తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు,మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

*** ఎం. బి. బి ఎస్,ఎన్ఐటి ఐఐటి విద్యార్థుల సన్మాన కార్యక్రమం లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



ప్రజాస్ఫూర్తి:భైంసా : సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు..గురువారం భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఇండస్ట్రీ లో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30మంది ఎం. బి. బి ఎస్ సాధించిన విద్యార్థులను,6గురు ఎన్. ఐ. టి. ఐఐటీ సాధించిన విద్యార్థులను, 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గం లో విద్యార్థులు పెద్ద మొత్తం లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడంతోపాటు, కొంతమంది విద్యార్థులు ఎన్ఐటి ఐఐటీలో రాణించడం శుభపరిణమం అన్నారు.. చదువుతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధించగలుగుతామని, ఇష్టపడి చదివి విద్యార్థులు అనుకున్న గమ్యానికి చేరుకోవాలన్నారు.. ప్రతి సంవత్సరం మరియు అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాల ను చేపట్టడం జరుగుతుందని చెప్పారు.. అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడు కోనసాగిస్తామన్నారు.నియోజకవర్గంలో విద్యారంగంపై ప్రధాన దృష్టికి సాధించడం జరిగిందని, అందులో భాగంగానే ముధోల్ లో దాదాపు 300 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కుంటాల మండలం లో మోడల్ స్కూల్ ను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చి తొమ్మిది కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. విద్యా, వైద్యం, రైతాంగానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయసంఘ నాయకులు మాట్లాడుతూ అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి భోజన్న, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తాత్రి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, పిఆర్టియు నిర్మల్ జిల్లా అధ్యక్షులు రమణ రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యను అందించాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి, భైంసా: ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని, అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిర్దేశిత పరీక్షలను నిర్వహిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి కృషిచేయాలని పేర్కొన్నారు.విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కావలసిన పరికరాలన్నీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్యకళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, డిసిహెచ్ఓ కాశీనాథ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుల్లెట్ ట్రైన్ సాధించు కోవడం సూర్యాపేట ప్రజల బాధ్యత



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడం అనేది సూర్యాపేట జిల్లా ప్రజల హక్కుగా భావించి ఉద్యమాలను ఉదృతం చేయాల్సిన అవసరం ఉందని పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వ్యాపారవేత్త అప్పం శ్రీనివాస్ రావు అన్నారు.బుల్లెట్ సాధన దీక్ష 57వ రోజు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దీక్షలు పాల్గొని వారు మాట్లాడారు. సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ అమానుషంగా కుట్రపూరితమైన వ్యక్తులు దారి మళ్ళిస్తుంటే సూర్యాపేట ప్రజలు చేతులు కట్టుకొని కూర్చోకూడదని ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమం బాధ్యతగా భావించాలని కోరారు. ఉద్యమాలు చేసి . ఈ దీక్ష కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల నర్సింహ, యేలె సత్యనారాయణ, దూలం నగేష్, యలగందుల సుదర్శన్, చిలువేరు నరసింహారావు, కడారి బిక్షం, పొన్నం వెంకన్న, భీమనపల్లి వెంకటేశ్వర్లు, కనుకుంట్ల శారదా దేవి, మిట్టకోల సతీష్, చిధిరాల శోభారాణి, మిట్ట కోల యుగంధర్, బాల్నే క్రాంతి,పోట్ట బత్తుల గోవర్ధన్, రుద్ర నారాయణ, జేల్ల సూర్యనారాయణ, చిలుకమర్రి చంద్రమౌళి, పున్నవెంకన్న, కలకుంట్ల అరుణోదయ సాగర్, రాపోలు ఉపేందర్ తదితరులు 40 మంది దీక్షలో కూర్చున్నారు.

అమ్మా నాన్నా చదువులో మీరే మా సగం బలం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ దేశీరామ్ నాయక్ అన్నారు.పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు బి.బాబు అధ్యక్షతన పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దేశీరామ్ నాయక్, ఏటీడీఓ ఉపేందర్ హాజరయ్యారు. పదో తరగతి ఫలితాల మెరుగుదలపై చర్చించి,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డెన్ అనిత,ఉపాధ్యాయులు,సిబ్బంది,తల్లిదండ్రులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా భూ సర్వే

*** కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా:భూ రీసర్వే ప్రక్రియలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా పూర్తిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు.హవేలీ ఘనపూర్ మండలం శాలిపేట్ గ్రామంలో భూభారతి భూముల రి సర్వే ను ఏడి సర్వే కిషన్ , తాసిల్దార్ సింధు రేణుక తో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు.గ్రామ పరిధిలో మొత్తం 534 ఎకరాల రెండు కుంటల భూమి ఉండగా ఇప్పటివరకు సుమారు 278 ఎకరాల 27 కుంటల మేర సరిహద్దుల నిర్ధారణ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ప్రభుత్వ భూమి 341 ఎకరం 5 కుంటలు ఇనామ్ ల్యాండ్ 17 కుంటలు ,అసైన్డ్ ల్యాండ్ 240 ఎకరా లు12 కుంటలు శిఖం ల్యాండ్ 61ఎకరాలకు సంబంధించి ఇంతవరకు సర్వే కంప్లీట్ చేయడం జరిగింది మిగిలిన సర్వే ప్రక్రియ రైతు వారి ఆధీనంలో ఉన్న భూములను సర్వే నిర్వహిస్తున్నామని దీనిలో హెచ్చుతగ్గులు ఏమైనా ఉంటే నోటీసులు ఇవ్వడం జరుగుతుందని అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని పునఃపరిశీలన పగడ్బందీ మ్యాపులతో డిజిటల్ సర్వే పూర్తవుతున్నారు ఒకరి భూమి మరొకరికి పోయే ఆస్కారం ఉండదని వివరించారు ఆధునిక సాంకేతికతను వినియోగించి, పాత రికార్డులతో సరిపోల్చుతూ భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. సరిహద్దుల విషయంలో రైతుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని సూచించారు. రీసర్వే తర్వాత రికార్డులు మరింత స్పష్టంగా ఉండి, భవిష్యత్తులో యాజమాన్య సమస్యలు తలెత్తకుండా రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

మనసు గెలిస్తేనే జీవితం గెలుపు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మానసిక ఆరోగ్యం లేనిదే శారీరక దృఢత్వానికి అర్థం లేదని రోటరీ క్లబ్ అధ్యక్షులు దూదికట్ల సత్యం అన్నారు.ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక వికాస్ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో యువత ఒత్తిడి,ఆందోళన, నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జీవన వ్యయం, దుర్వ్యసనాలు మనసును కృంగదీస్తున్నాయని అన్నారు. మనసును అదుపులో ఉంచుకుంటే చెడు ఆలోచనలు దరిచేరవని, మానసిక ఆందోళనలో ఉన్నవారికి ఒక మంచి మాట ధైర్యాన్నిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రోటరీ ప్రధాన కార్యదర్శి శంతన్ రామరాజు, కోశాధికారి ముల్లంగి మోహన్ రెడ్డి, సీనియర్ రోటేరియన్లు బిక్కి వెంకటేశ్వర్లు, వల్లాల రమేష్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల కష్టాలు తెలుసుకున్న ఎస్టీ మోర్చా



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ జిల్లా జామలపల్లిలోని విద్యా భారతి, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలను ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గూగుల్ సురేష్ నాయక్,ఎస్టీ మోర్చా జిల్లా బృందం సందర్శించింది.ప్రిన్సిపాళ్లతో సమావేశమై విద్యార్థుల సమస్యలు,మౌలిక సదుపాయాలు, భోజన వసతులు, ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పరిశుభ్ర,వాతావరణం ఉండటం ముఖ్యమని, గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అసంపూర్తి పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయండి

*** 8 వ వార్డు సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి: ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి డి.వాసంతిని కూసుమంచి 8 వ వార్డు సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారికి కూసుమంచి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ప్రాథమిక పాఠశాలలోఉన్న మూడు గదులలో, మొత్తం 124 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, ప్రీ ప్రైమరీ తరగతి విద్యార్థులకు ఒక గది కేటాయించ గా మిగిలిన రెండు గదులలో మాత్రమే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు అని తెలియజేయడం జరిగింది. కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి వాసంతిని కోరడం జరిగినది. వారు స్పందిస్తూ తక్షణమే కోఆర్డినేటర్ పాఠశాల సందర్శించి ,పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కూకట్‌పల్లిలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'మైన్ డైమండ్ షో'

*** అక్టోబర్ 9 నుంచి 18 వరకు ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన**



కూకట్పల్లి,ప్రజాస్ఫూర్తి: ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ కూకట్‌పల్లి షోరూమ్‌లో 'మైన్ డైమండ్ షో'ను ప్రారంభించింది. అక్టోబర్ 9 నుంచి 18వ తేదీ వరకు ఈ ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన కొనసాగనుంది.వినియోగదారులకు విభిన్న డిజైన్లలో రూపొందించిన వజ్రాభరణాలను పరిచయం చేయడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రదర్శనలో భాగంగా వివిధ రకాల వజ్రాభరణాలు, ప్రత్యేక డిజైన్లు, నాణ్యతకు ప్రాధాన్యమిచ్చే ఆభరణాల కలెక్షన్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.వజ్రాభరణాల కొనుగోలులో వినియోగదారులకు నమ్మకం, నాణ్యత, పారదర్శకత అందించేందుకు సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. వజ్రాల నాణ్యత ధ్రువీకరణ, ఆభరణాల రూపకల్పన, కొనుగోలు అనంతరం సేవలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ 1993లో ప్రారంభమై, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించింది. బంగారు, వజ్రాభరణాల విభాగాల్లో వినియోగదారుల విశ్వాసాన్ని పొందుతూ వివిధ దేశాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను సందర్శించి, తమకు నచ్చిన డిజైన్లను పరిశీలించవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

బతుకమ్మ ఘాటును పరిశీలించిన కొడిపల్లి సర్పంచ్



కొడిపల్లి (ప్రజాస్ఫూర్తి): మండల కేంద్రమైన కొడిపల్లిలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ ఘాట్‌ను కొడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ పరిశీలించడం జరిగింది. అలాగే కట్టపై ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించి,పరిసరాలను శుభ్రం చేయించడం జరిగింది.బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మలు వదలడానికి వచ్చే మహిళలకు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ పరిసరాలను డోజర్ సహకారంతో ముళ్లపదులను తొలగించి శుభ్రపరిచేందుకు చర్యలు చేపట్టారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణలో వివక్ష ఎందుకు?

*** గెజిట్ ప్రకారం 200 అడుగుల రహదారి హద్దులు నిర్ణయించాలి: ఎస్‌పీకే సాగర్**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి పట్టణంలో రహదారి విస్తరణ పనుల్లో పేదలు, చిరు వ్యాపారుల పట్ల ఒకలా, బహుళ అంతస్తుల భవనాల విషయంలో మరోలా వ్యవహరించడం ఏమిటని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ చైర్మన్ ఎస్. పి.కె. సాగర్ ప్రశ్నించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి సుభాష్ కాలనీ మీదుగా కృష్ణ కాలనీ వరకు గెజిట్, మున్సిపాలిటీ తీర్మానం ప్రకారం 200 అడుగుల రహదారి హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి, కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆవాల హతీష్, గంధం రాకేష్, రామినోజ్ రాజేందర్, ధారంగుల జస్వంత్, నూనె నరేష్, రియాజ్, ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

*** విస్డమ్ హైస్కూల్లో అంగరంగ వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు...**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను విస్డమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శుక్రవారం ముందస్తుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులలో హాజరై,రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి తీర్చిదిద్దారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరెస్పాండంట్ కంది సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ జీవన విధానంలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని వివరించారు.ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనదని,ఇలాంటి పండుగలు విద్యార్థులలో నైతిక విలువలను, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ మోర సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి,మన సంస్కృతిని భావితరాలకు అందించడానికి పాఠశాల తరపున ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయ బృందం కలిసి సాంప్రదాయక పాటలకు అనుగుణంగా కోలాటాలు ఆడుతూ,బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిన,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మహాలయ అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని శంకర్ విలాస్ సెంటర్ రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా గత ఐదు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న మహాలయ అమావాస్య అన్నదాన కార్యక్రమం శనివారం నాడు మధ్యాహ్నం నిర్వహిస్తు న్నామని, కాబట్టి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు సుమన్ వెంకన్న,గోపారపు రాజు, నరేంద్రుని విద్యాసాగర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, స్థానిక కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు హాజరవుతారని వారు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి మహాలయ అమావాస్య అన్నదానాన్ని స్థానిక మిత్రుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వేద పండితుల ఆశీర్వాదంతో కార్యక్రమం మొదలవుతుందని, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని వారు అన్నారు. ఇది తరతరాలుగా వస్తున్నటువంటి కార్యక్రమం, మన పూర్వీకులను స్మరించుకుంటూ వారి పేరున అన్నదానం చేస్తే మనకు కుటుంబానికి మేలు జరుగుతుందని,అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ కార్యక్రమాన్ని సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లం సురేష్, మొరిశెట్టి రాము, కొండా శ్రీనివాస రావు, భూసి జాని, సైదులు, సిద్ధి శ్రీకాంత్, గుడిపాటి రమేష్, చందా రాజశేఖర్, నరేంద్రుణి హరీష్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ విశిష్ట సంస్కృతి, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

*** చైతన్య విద్యానికేతన్, లెనిన్ నగర్ పాఠశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు**





జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: తెలంగాణ విశిష్ట సంస్కృతి, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పాఠశాల చైర్మన్ ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి అన్నారు. జగద్గిరి గుట్ట డివిజన్ మగ్దూంనగర్లోని చైతన్య విద్యా నికేతన్, లెనిన్ నగర్ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఎంతో వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు సాంప్రదాయ దుస్తులు ధరించి, రకరకాల రంగురంగుల పూలతో (తంగేడు, గునుగు, బంతి, చామంతి మొదలైనవి) బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకువచ్చి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడుతూ, పాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థినిలతో కలిసి బతుకమ్మ పాటలు పాడి కోలాటాలతో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ మాట్లాడుతూ మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలు, నైతిక విలువలను భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ జీవన విధానంలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని వివరించారు.ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనదని,ఇలాంటి పండుగలు విద్యార్థులలో నైతిక విలువలను, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయన్నారు.ఈ వేడుకల్లో భాగంగా బతుకమ్మలను అందంగా పేర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ప్రశాంత వాతావరణంలో బతుకమ్మలను నిమజ్జనం చేసి, అందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి శారద, ఉపాధ్యాయులు మోనిక, మమత,రవళి, మినాక్షి, స్వర్ణ, విద్యార్థులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి క్రీడా పోటీల్లో భూపాలపల్లి క్రీడాకారుల సత్తా

*** శ్రీనివాస్ రెడ్డికి స్ట్రాంగ్‌మెన్.. దువ్వ అనూషకు బెస్ట్ స్ట్రాంగ్ ఉమెన్ టైటిళ్లు**



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి): సింగరేణి కంపెనీ స్థాయి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో భూపాలపల్లి ఏరియా క్రీడాకారులు సత్తా చాటారు. బెల్లంపల్లి ఏరియా పరిధిలోని గోలేటిలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో పలు పతకాలు, టైటిళ్లు సాధించడంతోపాటు పలువురు కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.మహిళల 69 కిలోల పవర్ లిఫ్టింగ్ విభాగంలో దువ్వ అనూష (జనరల్ అసిస్టెంట్, ఎస్ అండ్ పీసీ) ప్రథమ స్థానం సాధించడంతోపాటు 'సింగరేణి బెస్ట్ స్ట్రాంగ్ ఉమెన్ 2026 27' టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. పురుషుల 93 కిలోల విభాగంలో జిమ్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి ప్రథమ స్థానం సాధించి 'సింగరేణి స్ట్రాంగ్‌మెన్ 202627' టైటిల్ గెలుచుకున్నారు. వీరిద్దరూ కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు.120 కిలోలకు పైబడిన పవర్ లిఫ్టింగ్ విభాగంలో కేటీకే1 సీనియర్ అండర్ మేనేజర్ మీర్జా యాసిన్ బెగ్ ప్రథమ స్థానం సాధించారు.వెయిట్ లిఫ్టింగ్ 75కిలోల విభాగంలో మైన్ రెస్క్యూ స్టేషన్ ఈపీ ఆపరేటర్ పి. ప్రకాష్ మొదటి స్థానం సాధించగా, బాడీ బిల్డింగ్ 75 కిలోల విభాగంలో ద్వితీయ స్థానం పొందారు. బాడీ బిల్డింగ్ 55 కిలోల విభాగంలో కేటీకే5 జనరల్ అసిస్టెంట్ ప్రదీప్ స్వర్ణ పతకం సాధించారు. పవర్ లిఫ్టింగ్ 74 కిలోల విభాగంలో కేటీకే1 జనరల్ అసిస్టెంట్ బిల్లకంటి వెంకటేశ్వర్లు ద్వితీయ స్థానంలో నిలిచారు. మీర్జా యాసిన్ బెగ్, పి. ప్రకాష్, ప్రదీప్ కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అభినందించారు.కోల్ ఇండియా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి సంస్థకు, ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

చౌటుప్పల్ మండల కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

*** మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా బోయ దేవేందర్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం చౌటుప్పల్ మండల కాంగ్రెస్ కమిటీని ఆమోదించి ప్రకటించారు. చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షునిగా బోయ దేవేందర్ రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొడిగె ఆనంద్, రిక్కల మహేందర్ రెడ్డి, వల్లకాటి అనిల్, ప్రధాన కార్యదర్శులుగా మాధగోని శేఖర్ గౌడ్, జాల మల్లేష్ యాదవ్, ఫకీరు వంశీధర్ రెడ్డి, కోశాధికారిగా గూడూరు నవీన్ రెడ్డి, స్పోక్ పర్సన్ గా బకనగారి శ్రవణ్ కుమార్, కార్యదర్శులుగా తగరం నాగరాజు, బావండ్లపల్లి రాజు, ఆవుల రాజు, చింతల జయశ్రీ, కార్యవర్గ సభ్యులుగా యర్రం శ్రీను, ఏ కవిత, సరిపల్లి మంజుల, సుర్కంటి బుచ్చిరెడ్డి, ఆంగోతు సువర్ణలు ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ, బిల్వార్చన, రుద్రాభిషేకం



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలం, కళ్లేం గ్రామ ప్రజలు మాస శివరాత్రి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ స్వయం భూ శంబు లింగేశ్వర స్వామి ఆలయం లో గ్రామ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి కుంకుమ పూజ, బిల్వార్చన, రు ద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో సమర్పించారు.పవిత్రమైన మాస శివరాత్రిని పురస్క రించుకుని ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు స్వామివారిని దర్శించుకుని, గ్రామ ప్రజల శ్రేయస్సు, కుటుంబాల సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరి సంపదలు కలగాలని ప్రార్థించారు. ఆ పరమశివుని కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండి, ప్రతి ఒక్కరి జీవి తాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియా లని భక్తులు ఆకాంక్షించారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండలం కాల్వపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.పౌరసరఫరాల శాఖ మరియు భారీ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇవాళ లబ్ధిదారులకు పట్టాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. మిగిలిన అర్హులకు కూడా త్వరలోనే పట్టాలు అందజేస్తామని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పేదల సంక్షేమం కోసం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొరల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్ నాగరాజు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్లకొండలో రైతన్నల ఆగ్రహం.. గోదావరి జలాల కోసం రాస్తారోకో!



జనగామ, ప్రజాస్ఫూర్తి : మండలంలోని వడ్లకొండ గ్రామంలో రైతులు ఆందోళన బాట పట్టారు. తమ జీవనాధారమైన యేన చెరువుకు గోదావరి జలాలను తరలించి నీటితో నింపాలని డిమాండ్ చే స్తూ వందలాది మంది రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. చెరువులో నీరు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీరు అందక తీవ్రంగా నష్టపోతున్నామ ని వాపోయారు.తమ సమస్యను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేతుల్లో పురుగుల మందు డబ్బాలు పట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. యేన చెరువుకు గోదావరి జలాలను తరలించి తమ పంటలను కాపాడాలని, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన



భూపాలపల్లి: (ప్రజా స్ఫూర్తి):ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీల నిరసనపై పోలీసుల చర్యలను ఖండిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈనెల18 న కూకట్ పల్లి లో పెద్ద బతుకమ్మ



కూకట్పల్లి,ప్రజాస్ఫూర్తి:ఈ సంవత్సరం అమావాస్య రెండు రోజులు ముందు బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు సాయంత్రం సమయంలో కూకట్పల్లి గ్రామంలో పలుచోట్ల , కూకట్పల్లి హనుమాన్ దేవాలయం వద్ద సాయంకాలం ఐదు గంటల నుండి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అక్కడ ఆటలు ఆడిన తర్వాత బతుకమ్మలను పిఎన్ఎం స్కూల్ గ్రౌండ్ వద్ద మళ్లీ బతకమ్మలాడి తదనంతరం రంగదాముని చెరువులో నిమజ్జనం చేస్తారు అని, అక్కడ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యవేక్షించి అధికారులకి ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ బతుకమ్మలు ఆడేందుకు వచ్చే ప్రతి ఆడపడుచులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మున్సిపల్ శాఖ పోలీసు శాఖ వారికి కోరారు.ఈనెల 18 తారీకున పెద్ద బతుకమ్మ ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతాయని బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

భూపాలపల్లి డిపోలో ప్రశాంతంగా ఆర్టీసీ ఎన్నికలు

*** 98.4 శాతం పోలింగ్ నమోదు**



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు భూపాలపల్లి డిపోలో శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.డిపోలో మొత్తం 262 మంది కార్మికులకు ఓటు హక్కు ఉండగా, 258 మంది ఓటు వేశారు. దీంతో 98.4 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికల విధుల్లో నలుగురు ఉద్యోగులు పాల్గొన్నారు. డిపో పరిధిలో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ నెల 17న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఫోన్ పే కేటుగాడి మోసం 9000 సిగరెట్ ప్యాకెట్లతో మాయం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కితవారిగూడెంలో ఫోన్ పే మోసం ఘటన శనివారం చోటు చేసుకుంది. షాప్ యజమాని మేళ్లచెరువు చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ..... మండలంలోని కీతవారిగూడెంలో ప్రధాన రహదారిపై ఉన్న చంద్రశేఖర్ కిరాణా షాపు వద్దకు మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని యువకులు వచ్చి ఖరీదైన సిగరెట్లు కావాలని అడిగారు. కాగా షాప్ యజమాని భార్య మేళ్లచెరువు గౌతమి రూ.9000 విలువ గల సిగరెట్లు ఇవ్వగా ఫోన్ పే చేసానంటూ బుకాయింపు. దీంతో చేరుకున్న గౌతమి వెంటనే వచ్చి ఫోన్ పే లో డబ్బులు రాలేదు అంటూ వారిని అడగడంతో మళ్లీ చేస్తానంటూ తీసుకొని ద్విచక్ర వాహనంపై పరారైన గుర్తుతెలియని వ్యక్తులు. దీంతో లబోదిబోమంటున్న షాపు యజమాని కుటుంబ సభ్యులు దుండగులను గుర్తించి తమకు న్యాయం చేయాలంటే వేడుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరా పోటీలు పరిశీలిస్తున్న పోలీసులు.

మహబూబాబాద్ మున్సిపాలిటీకి గవర్నర్ ప్రశంస

మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి:పారదర్శక పాలనలో మహబూబాబాద్ మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. సమాచార హక్కు చట్టం2005, సెక్షన్ 4(1)(బి) కింద ఉత్తమ స్వచ్ఛంద సమాచార వెల్లడింపు విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డును దక్కించుకుంది.ఈ పురస్కారాన్ని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వినోద్ కుమార్,తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అందుకున్నారు. ప్రజలు అడగకముందే అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచడం,పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయడం వల్లే ఈ గుర్తింపు లభించింది.ప్రజాస్వామ్యంలో సమాచారం ప్రజల హక్కు అని,దానిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని ఈ అవార్డు మరోసారి చాటిచెబుతోంది.

జాతీయ సదస్సులో ప్రశంసలు అందుకున్న రమేశ్ కార్తీక్ నాయక్

*** అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి:వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6. 7 తేదీల్లో రెండు రోజుల పాటు కేరళ సెంట్రల్ యూనివర్సిటీ, సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కొచ్చిలోని, కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సదస్సులో సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, కవి, కథా రచయిత, ఠాగూర్స్ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయులు రమేశ్ కార్తీక్ నాయక్ "వందేమాతరం ఓ పునర్జీవ గీతం" అనే అంశంపై తన పరిశోధన వ్యాసాన్ని సమర్పించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనిగాంధీనగర్ లో గల ఠాగూర్స్ హైస్కూల్లో పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్ మాట్లాడుతూ 'వందేమాతరం - తెలుగు రాష్ట్రాలపై ప్రభావం, వలస పాలన కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థుల పోరాటాలు' అనే అంశంపై రమేశ్ కార్తీక్ నాయక్ తన పరిశోధనా పత్రాన్ని సమర్పించారని తెలిపారు. ఈ జాతీయ సదస్సులో పత్రాన్ని సమర్పించిన వారిలో రమేశ్ కార్తీక్ నాయక్ అత్యంత పిన్న వయస్కుడైన పరిశోధకుడిగా నిలిచారు.అందరి ప్రశంసలను అందుకున్నారు. ఈ సదస్సులో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ,ఒడిశా రాష్ట్రాలకు చెందిన పలువురు పరిశోధకులు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.శివగోపి, ఇతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కీతవారిగూడెం విద్యార్థికి జాతీయ స్థాయిలో కాంస్య పతకం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామానికి చెందిన కోమరాజు నరసింహారావు జాతీయస్థాయి ధాంగ్ టా ఛాంపియన్షిప్లో కాంస్య పతకం సాధించి గ్రామానికి గర్వ కారణంగా నిలిచాడు. కోమరాజు ఆంజనేయులు, జ్యోతి దంపతుల కుమారుడైన నరసింహారావు నేరేడుచర్ల మండలం బొత్తలపాలెంలోని కాంకర్ స్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యనభ్యసిస్తున్నాడు.జమ్మూకశ్మీర్లోని శ్రీనగర్లో సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన 32వ జాతీయ సీనియర్ ధాంగ్ టా ఛాంపియన్షిప్లో పాల్గొన్న నరసింహారావు ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించి సన్మానించింది. నరసింహారావు సాధించిన విజయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మానసిక ఆరోగ్యమే మనిషి మనుగడకు మూలం

*** జడ్జి స్వాతి మురారి**



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి:దివ్యాంగులకు అండగా నిలవడం ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గువ్వెల్ల దివ్యాంగుల సేవా కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పిల్లలతో ముచ్చటించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అత్యంత కీలకమని అన్నారు.దివ్యాంగులకు చట్టపరంగా లభించే హక్కులు,నల్సా పథకం 2024 ద్వారా అందే ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. కేంద్రంలోని వసతులు,భోజనం, వైద్య సేవలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా కేంద్రం నిర్వాహకులు పాల్రాజ్,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీ జీ ఎన్ పీ డీ సీ ఎల్ లక్ష్యం

*** టీ జీ ఎన్ పీ డీ సీ ఎల్ సీఎండీ కె. వరుణ్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీ జీ ఎన్ పీ డీ సీ ఎల్ లక్ష్యమని సీఎండీ కె. వరుణ్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ సబ్స్టేషన్ను సందర్శించి, ముస్తాబాద్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ వ్యవస్థ పనితీరును పరిశీలిస్తూ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరంముస్తాబాద్ సెక్షన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్లను సీఎండీ పరిశీలించారు. వాటి ద్వారా విద్యుత్ సరఫరా మెరుగుదలకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ పర్యటన ద్వారా స్పష్టమైంది. విద్యుత్ సరఫరా పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, వ్యవస్థ పనితీరును సమీక్షించడంపై సీఎండీ దృష్టి సారించారు.ఈ పర్యటనలో సిరిసిల్ల ఎస్ఈ శ్రీనివాస రావు, సిరిసిల్ల డీఈ అంజయ్య, గంభీరావుపేట ఏడీఈ శ్రీనివాసులు, ముస్తాబాద్ ఏఈ సి.హెచ్. విష్ణు తేజ పాల్గొన్నారు.




తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించాలి

- **గ్రీన్ గ్రోవ్ లో బతుకమ్మ సంబరం**
- **విద్యాసంస్థల చైర్పర్సన్ బండి వీణా అనిల్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించాలని గ్రీన్ గ్రోవ్ విద్యాసంస్థల చైర్పర్సన్ బండి వీణా అనిల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్లోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ, బతుకమ్మ ఆడుతూ ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్పర్సన్ బండి వీణా అనిల్ రెడ్డి,డైరెక్టర్ సాదుపల్లి లక్ష్మి పాల్గొని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకోవడం, వాటి విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. ఇటువంటి వేడుకల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, ఐకమత్యం పెరుగుతాయన్నారు. విద్యార్థులకు సంస్కృతిపై అవగాహన కల్పిస్తూ వేడుకలు జరిపిన పాఠశాల యాజమాన్యాన్ని పలువురు ప్రశంసించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాస్ఫూర్తి,ముస్తాబాద్:ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించి, నేరాల నియంత్రణకు సహకరించేలా పోలీసులు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు, ముస్తాబాద్ ఎస్సై జ్యోతి పాల్గొని పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూసైబర్ నేరాల గురించి ప్రజలకు వివరించి, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని, మోసపూరిత ఆన్లైన్ లావాదేవీల పట్ల జాగ్రత్తగా ఉండాలని వివరించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యానికి తావివ్వకుండా, రహదారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు.మైనర్లకు వాహనాలు నడపడానికి అనుమతించవద్దని, తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్న వయసులో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీయడమే కాకుండా చట్టపరమైన సమస్యలకు కారణమవుతుందని వివరించారు.

సర్వరం పాఠశాలలో వంటగది నిర్మాణానికి శంకుస్థాపన

*** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్ రెడ్డి**



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్ రెడ్డిఅన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సర్వరం గ్రామంలోని ఎంపియుపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమంలోఆయనపాల్గొని శంకుస్థాపనచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసర్వరం ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మాణానికి శంకుస్థాపన జరగడం పాఠశాల అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయి విద్యార్థులకు మెరుగైన భోజన సదుపాయాలు అందుబాటులోకి రావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్వరం గ్రామ సర్పంచ్ వినోద నాగేశ్వర్ రావు, కార్యదర్శి జి.సుస్మిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రాజారావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్. వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెండెం సైదులు, యూత్ నాయకులు భీమపంగు కోటేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి.. సంప్రదాయాలకు.. ప్రతీక బతుకమ్మ

- **కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు**
- **చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పావని రమేష్గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ గుత్తా గోపాల్రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకల్లో సందడి చేశారు.



షుగర్ పేషెంట్లు పండ్లు తినొచ్చా?

పండ్లలో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తిన్నప్పుడు గ్లూకోజ్ అనే షుగర్‌గా కార్బ్స్ మారతాయి. కొన్ని పండ్లలో షుగర్ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇవి తిన్నప్పుడు అది రక్తంలోకి చేరి.. బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరిగేందుకు కారణం కావొచ్చు. అందుకే డయాబెటిస్ ఉన్న వారు ఎక్కువగా పండ్లు తినొచ్చా లేదా అనే సందేహం ఉంటుంది.

పండ్లతో పాటు ఇవి కూడా..

పండ్లు తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ కాస్త పెరుగుతాయి. ఫైబర్ ఈ ప్రక్రియను తగ్గించడంలో సహకరించినా.. కాస్త షుగర్ స్థాయి అధికమయ్యే అవకాశం ఉంటుంది. హెల్దీ ఫ్యాట్స్ లేదా ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలతో పండ్లను డయాబెటిస్ ఉన్న వారు తినవచ్చని




సుబ్రతా దాస్ తెలిపారు. "డయాబెటిస్ లేదా ఇన్సులిన్ రెసిస్టెంట్స్ ఉన్న వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తిన్నాక ఇలా జరుగుతుంది. అయితే, హెల్దీ ఫ్యాట్స్ లేదా ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాలతో కలిపి పండ్లను తినడం వల్ల గ్లైసెమిక్ రెస్పాన్స్ తగ్గుతుంది. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ తక్కువగా ఉంటాయి. బ్లడ్ షుగర్ తటస్థంగా ఉండడం ఎక్కువగా ఫ్యాట్, ప్రోటీన్‌పై ఆధారపడి ఉంటుంది. బ్లడ్ షుగర్ స్థాయిలు స్థిరంగా ఉండేలా ప్రోటీన్ చేయగలదు. కార్బొహైడ్రేట్ల ప్రక్రియను ఫ్యాట్ నెమ్మదయ్యేలా చేస్తుంది" అని సుబ్రదా దాస్ పేర్కొన్నారు. బాదం, ఆక్రోటు లాంటి నట్స్, సీడ్స్, పప్పు ధాన్యాలు, యగర్ట్, కోడిగుడ్లు, ఫ్యాటీ ఫిష్ లాంటి ఆహారాల్లో హెల్దీ ఫ్యాట్స్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి.

హెల్దీ ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ మేలు

ఆరోగ్యకరమైన ఫ్యాట్స్ ఉండే ఆహారాలు తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. "నట్స్, అవకాడో, కోడిగుడ్డు సొన, ఆలివ్ ఆయిల్ లాంటి వాటిలో హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటి వల్ల గుండె వనితీరు మెరుగవుతుంది. ఇవి తింటే ఎక్కువసేపు ఎనర్జీ ఉంటుంది. శరీరంలో నేచురల్ హార్మోన్ కోర్టిసాల్ ఉదయం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు ఈ హెల్దీ ఫ్యాట్స్ ప్రయోజనకరంగా ఉంటాయి. ఇవి తీసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. కార్బ్స్ కాకుండా ఉదయం ఫ్యాట్స్ తీసుకుంటే బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉండేందుకు సహకరిస్తాయి. కార్బ్స్ ఎక్కువగా తీసుకుంటే ఆ లెవెల్స్ ఎక్కువవుతాయి. అందుకే డయాబెటిస్ ఉన్న వారు హెల్దీ ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ తినడం చాలా ముఖ్యం" అని డాక్టర్ సుబ్రతా దాస్ చెప్పారు.

శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెంట్‌ను, విటమిన్లు శోషించుకునే గుణాలను హెల్దీ ఫ్యాట్స్ మెరుగుపరుస్తాయని సుబ్రతా దాస్ వెల్లడించారు. పేగుల ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తికి కూడా మేలు చేస్తాయని చెప్పారు. నెయ్యి, వెన్న, కొబ్బరి నూనె, అవకాడో ఆయిల్‌లోనూ హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయన్నారు. నట్స్, నట్స్ బటర్ కూడా ఆహారంలో తీసుకోవచ్చని చెప్పారు. ఫ్రైడ్ ఫుడ్స్, కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే బ్రెడ్, పాస్తా, పిజ్జా లాంటివి తినకూడదని తెలిపారు.



చలికాలంలో ఈ నూనె వాడండి



చలికాలం అతిత్వరలో వచ్చేస్తోంది. ఇప్పటికే కాస్త చలి మొదలైంది. ఈ కాలంలో వాతావరణం చల్లగా మారిపోతుంది. దీనివల్ల చర్మ సమస్యలు ఎక్కువగా ఎదురవుతాయి. చర్మం పొడిబారడమే కాకుండా మరిన్ని ఇబ్బందులు వస్తాయి. అయితే, ఈ కాలంలో బాదం నూనె (ఆల్మండ్ నూనె) చాలా ఉపయోగపడుతుంది. అందుకే చలికాలం రాకముందే ఈ నూనెను తెచ్చిపెట్టుకోండి. చర్మానికి బాదం నూనె ఏ ప్రయోజనాలు కల్పిస్తోందో ఇక్కడ తెలుసుకోండి.

చర్మం పొడిబారకుండా..

మెరుపు ఉండేలా

బాదం నూనె చర్మానికి తేమను అందజేస్తుంది. చలికాలంలో చర్మాన్ని పొడిబారకుండా చేయగలదు. నిద్రపోయే ముందు చర్మానికి బాదం నూనె రాసుకోండి. ఈ నూనెలో ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. దీంతో తేమను లాక్ చేసి ఉంచుతుంది. చర్మం పొడిబారదు. చర్మం మెరుపుతో ఉంటుంది. రెండు చేతుల్లో బాదం నూనె వేసుకొని కాస్త రుద్ది ముఖానికి పూసుకోవాలి.

కళ్ల కింద వలయాలకు..

కళ్ల కింద నల్లటి వలయాల్లా ఉండే డార్క్ సర్కిల్స్ సమస్యను ఆల్మండ్ ఆయిల్ తగ్గించదలదు. మీరు నిద్రించే ముందు ప్రతీ రోజు కళ్లు కింద ఈ నూనెను రాసుకోండి. రెండు వారాల్లోనే ఫలితం కనిపించే అవకాశం ఉంటుంది.

ట్యాన్ తగ్గేందుకు ఇలా..

చర్మంపై కమిలినట్టుగా నల్లగా ఏర్పడే ట్యాన్ తగ్గేందుకు కూడా బాదం నూనె ఉపయోగపడుతుంది. సమాన మోతాదులో కొన్ని చుక్కల బాదం నూనె, నిమ్మ రసం, కాస్త తేనెను కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ట్యాన్ ఏర్పడిన చోట పూయాలి. కొన్ని రోజుల్లోనే దీని సానుకూల ప్రభావాన్ని చూడొచ్చు.

మడమ పగుళ్లకు కూడా..

మడమ పగుళ్లకు కూడా బాదం నూనె వాడొచ్చు. పగిలిన మడమలకు ఈ నూనె రాత్రి వేళ రాయాలి. రాత్రంగా అలాగే వదిలేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ఏవైనా ఇన్ఫెక్షన్ ఉంటే తొలగిపోతుంది. స్కిన్ రాషెష్‌కు కూడా ఈ నూనె ఉపయోగించవచ్చు. బాదం నూనెతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

స్ట్రెచ్‌మార్క్స్ తగ్గేందుకు..

బాదం నూనెలో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. అందుకే ఈ నూనె స్ట్రెచ్‌మార్క్స్ తగ్గించగలదు. స్ట్రెచ్‌మార్క్స్ ఏర్పడిన చోట కాస్త బాదం నూనె వేసి మసాజ్ చేయాలి. స్నానం చేసిన వెంటనే ఇలా చేయాలి.

పెదాలకు..

చలికాలంలో పెదాలు పగలడం కూడా సమస్యగా ఉంటుంది. దీనికి కూడా బాదం నూనె ఉపయోగపడుతుంది. పెదాలకు ఈ నూనె రాసుకోవాలి. పెదాలు నల్లగా కాకుండా కూడా ఈ నూనె చేయగలదు. మచ్చలను కూడా తగ్గించగలదు.



మునక్కాడ చికెన్ కర్రీ.. ఇలా చేసుకోండి

మునక్కాడ, చికెన్ కాంబినేషన్ అదిరిపోతుంది. పైగా వీటిలో పోషకాలు కూడా ఎక్కువ. ఇక ఈ రెండింటినీ కలిపి వండితే ఆ రుచి అదిరిపోతుంది. మునక్కాడ చికెన్ కాంబినేషన్లో కర్రీ వండితే ఎవరికైనా ఇట్టే నచ్చేస్తుంది. వేడివేడి అన్నంలో ఈ కూరలోని ఇగురును కలుపుకొని చూడండి. రుచి అదిరిపోతుంది. ఇందులో లేత మునక్కాయలను వాడతాము. కాబట్టి కూరకు ప్రత్యేకమైన రుచి సువాసన వస్తాయి. మునక్కాడ చికెన్ కర్రీ రెసిపీ కూడా చాలా సులువు.

మునక్కాడ చికెన్ కర్రీ రెసిపీ

మునక్కాడలను కావాల్సిన సైజులో ముక్కలు కోసుకోవాలి శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి ఒక గిన్నెలో వేయాలి. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక యాలకులు, బిర్యానీ ఆకులు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. ఉల్లిపాయలను సన్నగా తరిగి నూనెలో వేసి వేయించాలి. అవి మెత్తగా ఉడికిన తరువాత పసుపు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి.

అందులో అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలుపుకోవాలి. అందులోనే కారం, చికన్ మసాలా వేసి కలుపుకోవాలి. అందులోనే మునక్కాడ ముక్కలు వేసి బాగా కలుపుకోవాలి. అవి అయిదు



నిమిషాలు వేగాక అందులో చికెన్ ముక్కలు వేసి వేయించాలి. అరగ్లాసు నీళ్లు వేసి కలపాలి.మూత పెట్టి పావుగంట సేపు ఉడికించుకోవాలి. ఇది ఇగురులాగా అయ్యాక కొత్తిమీర తరుగు చల్లుకోవాలి. ఈ మునక్కాడ చికెన్ కర్రీని అన్నంతో తిన్నా, చపాతీతో తిన్నా టేస్టీగానే ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు

మునక్కాయలు	రెండు
చికెన్	అర కిలో
టమోటాలు	రెండు
ఉల్లిపాయలు	రెండు
పచ్చిమిర్చి	నాలుగు
చికెన్ మసాలా	రెండు స్పూన్లు
కారం పొడి	రెండు స్పూన్లు
ఉప్పు	రుచికి సరిపడా
పసుపు	పావు స్పూను
యాలకులు	రెండు
బిర్యానీ ఆకులు	రెండు
కొత్తిమీర తరుగు	రెండు స్పూన్లు





టాలీవుడ్‌కు జాన్వీకపూర్ గుడ్‌బై?

జాన్వీకపూర్‌కు టాలీవుడ్ అంతగా అచ్చిరాలేదు. ఇప్పటివరకు తెలుగులో దేవర, పెద్ది సినిమాలు చేసింది. వీటిలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో జోడీ కట్టింది. స్టార్ హీరోలతో సినిమాలు చేశానన్న పేరు తప్ప జాన్వీ కెరీర్‌కు ఏ విధంగా ఉపయోగపడలేదు. ఈ రెండు సినిమాల్లో జాన్వీకపూర్ పాత్రలపై దారుణంగా విమర్శలొచ్చాయి. కేవలం గ్లామర్ యాంగిల్‌లోనే ఆమెను దర్శకులు ఈ సినిమాలో చూపించారు. దీంతో టాలీవుడ్ సినిమాలకు కొన్నేళ్ల పాటు దూరంగా ఉండాలని జాన్వీ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగు సినిమాల ఆఫర్లను రిజెక్ట్ చేస్తోన్నట్లు చెబుతోన్నారు.





అలా అయితే ముందుకెళ్లలేం

సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, కామెంట్స్‌ను అతిగా పట్టించుకుంటే మన ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ పేర్కొంది. ఇతరులను మెప్పించేందుకు ప్రయత్నించడం కంటే మనల్ని మనం అంగీకరించడమే ముఖ్యమని తెలిపింది. జీవితంలో ఎదురయ్యే ప్రతి విమర్శకు స్పందిస్తూ పోతే సొంత నిర్ణయాలు తీసుకోలేమని అభిప్రాయం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు మన ఆత్మగౌరవాన్ని ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఇటీవల భర్త విక్కీ కౌశల్‌తో కలిసి అంబానీ కుటుంబం నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకలకు కత్రినా హాజరైంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలో ప్రసవం తర్వాత ఆమె బరువు పెరగడంపై కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే కత్రినా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

20న ఇమాన్వీ ఫస్ట్ లుక్?

ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా ఫౌజీ టీమ్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్నట్లు సమాచారం. అక్టోబర్ 23 ఫౌజీ టీజర్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ టీజర్ కంటే మూడు రోజుల ముందు ఇమాన్వీ ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు. అక్టోబర్ 20న ఇమాన్వీ బర్త్‌డే ఉంది. అదే రోజు ఫౌజీలోఆమె లుక్‌తో పాటు హీరోయిన్ పాత్ర ఎలా ఉండబో తుందన్నది క్లారిటీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందు తోన్న మూవీ ఫౌజీ. దాదాపు నాలుగు వందల కోట్ల బడ్జెట్‌తో హిస్టారికల్ యాక్షన్ ఎం టర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఫౌజీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అక్టోబర్ 23న ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

డిసెంబర్ 4న థియేటర్లలోకి అలియాస్ రుక్మిణి



నితిన్, ఆఫీయి సయీద్ హీరోహీరోయినట్లుగా హీరో నాని నిర్మాణంలో రూపొందుతోన్న అలియాస్ రుక్మిణి సినిమాను డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు నాని ప్రకటించారు. ఓ కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నారు. ఇందులో భుజానికి బ్యాగ్ తగిలించుకొని జనాల మధ్యలో నుంచి నడుచుకుంటూ వస్తూ సింపుల్ లుక్‌లో నితిన్ కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో ఓ అమ్మాయి షాడో ఉండటం ఆసక్తిని పంచుతోంది. ఆమె ఎవరన్నది రివీల్ చేయలేదు.



డ్యాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్



తెలుగు ఫిలిం అండ్ టీవీ డాన్సర్స్ అండ్ డాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లోని సమస్యలు పరిష్కారం కాకుండా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడానికి వీలులేదని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అక్టోబర్ 11న జరగాల్సిన ఎన్నికలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిలిపివేసింది. ఎన్నికలకు ముందే వివాదాన్ని విచారించకుండా, ఎన్నికల అనంతరం విచారణకు తేదీ నిర్ణయించడంపై ట్రయల్ కోర్టు తీరును తప్పుబట్టింది.

ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

నెట్‌ఫ్లిక్స్:	మండాడి (తమిళ్) ఎపిక్ (తెలుగు) ప్రథమ దృష్యకుట్టతార్ (మలయాళం) రిపోర్టింగ్ లైవ్ (హిందీ) అన్‌ఫర్‌గెటబుల్ వెబ్‌సిరీస్ (ఇంగ్లీష్)
అమెజాన్ ప్రైమ్:	ఖలీఫా (మలయాళం) వీడియో (కన్నడ) అవారాపన్ 2 (హిందీ) స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే (ఇంగ్లీష్) బ్లాక్ జాంబీ (ఇంగ్లీష్) కాలనీ (ఇంగ్లీష్)
ఆహా ఓటీటీ :	మారెమ్మ (తెలుగు) పారిస్ కేఫ్ (తమిళం)
సోనీ లివ్ ఓటీటీ:	ది ఐస్ వెబ్‌సిరీస్ (మలయాళం)
ఈటీవీ విన్ :	లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ (తెలుగు)
సన్ నెక్స్ట్ ఓటీటీ :	లైఫ్ టుడే

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.